: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 సంచిక : 35 17-06-2024 పుటలు : 4





## సీ.ఎస్.ఈలో సింధుకు పిహెచ్.డి అవార్డు



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఫుల్ టైం రీసెర్చ్ స్కాలర్ బి. సింధుకి వీసీ ఆచార్య కె.పద్మరాజు పీహెచ్.డి పట్టాని ప్రదానం చేశారు. సీ ఎస్ ఈ లోని అసోసియేట్ ప్రొఫెసర్ డా.బి.కెజియరాణి మార్గదర్శకత్వంలో గేమెట్రిక్స్ మరియు మల్టీ-మోడల్ బయోమెట్రిక్స్ ను ఉపయోగించి పర్సనల్ ప్రమాణీకరణ అంశంపై సింధు పరిశోధన చేశారు. ఈ సాంకేతిక పరిశోధన ద్వారా పర్సనల్ ప్రమాణీకరణ పఠిష్ఠంగా జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సెలర్, రిజిస్ట్రార్,అధ్యాపక సిబ్బంది తదితరులు సింధుని అభినందిచారు.

### గోదావరి క్లస్టర్ యూనివర్సిటీకి

## యాప్సీ ప్రాజెక్ట్



ప్రాజెక్ట్ పత్రాలను అందుకుంటున్న డా.పి.విజయనిర్మల

ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ గోదావరి క్లస్టర్ యూనివర్సిటీకి ప్రాజెక్ట్ ను మంజూరు చేసారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ లలో ఒకరైన నన్నయ విశ్వవిద్యాలయ జంతుశాస్త్ర విభాగ అధ్యాపకులు డా.పి.విజయనిర్మలకు ప్రాజెక్ట్ పత్రాలను అందజేసి అభినందనలు తెలియజేసారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వారు గోదావరి క్లస్టర్ యూనివర్సిటీలు అయిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ, ఎన్.ఐ.టి. తాడేపల్లిగూడెం, డా.వై.ఎస్.ఆర్. హార్టికల్చర్ యూనివర్సిటీ లకు రూ. 10 లక్షల ప్రాజెక్ట్ ను మంజూరు చేశారని తెలిపారు. "వేస్ట్ టు వెల్త్: పెక్టిన్‌ని ఆగ్రో-వేస్ట్ నుండి విలువ జోడించిన న్యూట్రాస్యూటికల్స్ గా మార్చడం, ఆహారం మరియు ఫార్మా పరిశ్రమలో సంభావ్య అప్లికేషన్" అనే ప్రాజెక్టును రెండు సంవత్సరాల కాల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ లుగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ జువాలజీ అధ్యాపకులు డా.పి.విజయనిర్మల, ఎన్.ఐ.టి. తాడేపల్లిగూడెం డిపార్ట్మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అధ్యాపకులు డా.టి.జగన్మోహన రావు, డా.వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ బయోకెమిస్ట్రీ డా.డి.ఆర్.సలోమి సునీత వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రాజెక్ట్ బృంద సభ్యులకు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అభినందనలు తెలియజేసారు.

### కెమిస్ట్రీ అధ్యాపకులు రామకృష్ణ, విద్యాసాగర్‌కు

## పిహెచ్‌డి అవార్డులు





ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్-ఆఫ్ కెమిస్ట్రీ అధ్యాపకులు సలాది రామకృష్ణ, పెదపూడి సత్య రాఘవ విద్యాసాగర్ కు డాక్టరేట్ పట్టాలను వీసీ ఆచార్య కె.పద్మరాజు ప్రదానం చేశారు. యూనివర్సిటీలోని వీసీ కార్యాలయంలో వీసీ పద్మరాజు పిహెచ్.డి అవార్డులు అందజేసి అధ్యాపకులను అభినందించారు. దీనికి సంబంధించిన వివరాలను తెలియజేస్తూ "డైటొపిక్ డైహైడ్రాజైడ్ మరియు సెలెక్ట్ అమినో యాసిడ్స్‌తో కొన్ని డైవేలెంట్ ట్రాన్సిషన్ మెటల్ అయాన్‌ల బైనరీ మరియు టెర్నరీ కాంప్లెక్స్‌ల సొల్యూషన్ ఈక్విలిబ్రియాపై కెమికల్ మోడలింగ్ స్టడీ" పై ఆచార్య ఎ.సత్యనారాయణ, ఆచార్య పి.శ్యామల మార్గదర్శకంలో పిహెచ్.డి పూర్తి చేశారని తెలిపారు. పి. సత్య రాఘవ విద్యాసాగర్ "సిల్వర్ నానోపార్టికల్స్ యొక్క గ్రీన్ సింథసిస్, మాగ్నెటైట్ నానోపార్టికల్స్ మరియు జింక్ ఆక్సైడ్ నానోపార్టికల్స్ యొక్క సజల లీఫ్ ఎక్స్‌ట్రాక్షన్‌లను ఉపయోగించడం అలిసిస్, యాంటీ ఆక్సిడెంట్ మరియు యాంటీ బాక్టీరియల్ అప్లికేషన్స్" పై ఆచార్య కె. బసవయ్య పర్యవేక్షణలో పిహెచ్.డి. ని పూర్తి చేశారని చెప్పారు. నూతనంగా పిహెచ్.డి. పట్టాలను అందుకున్న డా. సలాది రామకృష్ణ, డా. పెదపూడి సత్య రాఘవ విద్యాసాగర్ లను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ అకాడమిక్ అఫైర్స్ ఆచార్య పి. సురేష్ వర్మ, కెమిస్ట్రీ అధ్యాపకులు ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, డా.కె.దీప్తి,డా. పద్మారావు, డా. మురళీకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

# సంపాదకీయం



## సంపద

మన చుట్టూ ఏముందో మనం కూడా దానిలోనే భాగమవుతామనేది మంచి మాట. అవును. పులిహూర తింటే పులిహూర తేనుపే వస్తుంది. బిర్యానీ తింటే బిర్యాని తేనుపే వస్తుంది. మరొకటి రాదు కదా! ఎటువంటి వ్యక్తులతో సాంగత్యాన్ని కలిగి ఉంటామో అటువంటి వారి ప్రభావం మన మీద ఎక్కువగా ఉంటుంది. ఎటువంటి పుస్తకాలు చదువుతున్నామో అటువంటి భావజాలాన్ని మనం కలిగి ఉంటాం.

నిరాశా జనకమైన వ్యాఖ్యానాలు చేస్తూ మనల్ని వెనక్కిలాగే వ్యక్తులు మన పురోగతిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తారు. మనల్ని తక్కువ చేస్తూ, నిందిస్తూ వాళ్ళు ఆనందపడతారు.మనల్ని ఉసూరుమనేలా చేసి నిస్సత్తువ ఆవహించేలా ప్రయత్నిస్తారు. ప్రతికూలమైన వ్యక్తుల సాంగత్యం, సమక్షం వల్ల మనకు కలిగే ప్రయోజనాలు ఏమీ ఉండవు. వాళ్ళు మన మార్పును,ప్రగతిని కోరుకోరు. అంగీకరించరు. సరికదా మనకు ఇబ్బందుల్ని సృష్టిస్తారు. ప్రతికూలమైన ఆలోచనలు కలిగిన వారికి దూరంగా జీవించటం కూడా అద్భుతమైన కళ. ప్రయత్నించి ప్రశాంతతను పొంది చూడండి.

సానుకూలమైన వ్యక్తుల సాంగత్యం పెంచుకునే కొద్దీ ఒక కొత్త శక్తిని పుంజుకుంటాం. అంతేకాదు సానుకూలమైన వ్యక్తులుగా ఎదుగుతాం కూడా! దానివల్ల గొప్ప ఉత్సాహం జీవితం నిండా అలముకుని ఉంటుంది. కల్మషం లేని వ్యక్తులు నిరంతరం మనకు సహకారంగా ఉంటారు. గొప్ప ఉత్తేజాన్ని మనలో నింపుతారు. అటువంటి వారి సమక్షం మనకు ఆనందాన్నిస్తుంది.

శ్రేయస్సును కోరుకునే వ్యక్తుల్లో ఒక అద్భుతమైన శక్తి దాగి ఉంటుంది. అటువంటి వారితో గడిపినప్పుడు, మాట్లాడినప్పుడు, మన విషయాలను పంచుకున్నప్పుడు కొత్త శక్తిని స్ఫూర్తిని పొందుతాం.వారి సలహాలు, ఆలోచనలు,సహకారాలు మనల్ని విజేతల్ని చేస్తుంటాయి.అంతేకాదు అటువంటి వ్యక్తులుగా మనం తయారవుతాం కూడా!

మనకు స్ఫూర్తినిచ్చే ఇష్టమైన మన టీచర్లతో, మిత్రులతో, వైద్యులతో, బంధువులతో మాట్లాడినప్పుడు గొప్ప అనుభూతికి లోనవుతాం. కేవలం వారి మాట చాలు మనం హాయిగా జీవించటానికి.ఆరోగ్యంగా ఉండటానికి.

ఒక మాట, లేదంటే పాట పదేపదే వింటున్నప్పుడు అది మన మనసులో తిష్ట వేసుకుని ముందు వరసలో కూర్చుంటుంది.అందుకనే ముందు వరసలో కూర్చోబెట్టటానికి కావలసిన వ్యక్తులు కొంతమంది మనకు కావాలి.అటువంటి వారే మనలో దార్శనికతను విస్తృత పరుస్తారు. మన లోపాల్ని సరిదిద్దుతారు. మనకు సహకరిస్తారు. వాళ్లే మన నిజమైన సంపద. సంపద అనే మాటకు అర్థం ధనం, భూమి, ఇల్లు,లోహాలు, సౌకర్యాలు, వస్తువులు అని మాత్రమే కాదు.మనుషుల హృదయాల్లో మనం సంపాదించుకున్న చోటు అని కూడా అర్థం!

# ప్రజా ప్రతినిధులను కలిసిన వీసీ పద్మరాజు





ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణాల పరిధిలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను వీసీ ఆచార్య కె.పద్మరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ లను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధి విశేషాలను తెలియజేసారు.







## పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సు

# అడ్మిషన్స్ గడువు పెంపు



SRI RAPARTHI RAMA INSTITUTE OF YOGA
KANAVARAM, EAST GODAVARI DISTRICT, RAJANAGARAM MANDAL-533296.
AFFILIATED TO
ADIKAVI NANNAYA UNIVERSITY RAJAHMAHENDRAVARAM

POST GRADUATE DIPLOMA IN YOGA (PGDY)
ONE YEAR COURSE

The Sri Raparthi Rama Institute of Yoga, Kanavaram A wing of Yoga Consciousness Trust - Kanavaram was established in the year 2016 to promote quality yoga education in its entirety and to train qualified and well-equipped yoga teachers by imparting traditional as well as scientific advancements in the Science of Yoga. Excellent opportunity to learn and teach Yoga

CONTACT:
N.Siva Sankara Rao 7382308440
M.V.G.S Sarma 9848438284

Hurry! Limited seats

COURSE CONDUCTED AT:
- Sri Raparthi Rama Institute of Yoga, Kanavaram (Course Fee: Rs. 10,000/-)
- AKNU Campus, Rajamahendravaram (AKNU Students & Staff: Rs. 6,000/- and For Others: Rs. 10,000/-)

Eligibility: Bachelor's Degree (Any Discipline)
Academic Year: 2024-25
Application Fee: Rs. 500/-
Last Date For Registration: 30-June- 2024
Notification Link: https://aknu.edu.in/
Registration Link: http://surl.li/sqenp
Date of Counseling: 10-July- 2024
APPLICATION PAYMENT DETAILS:
ANUCET A/C NO: 062611011000715
IFSC CODE: UBIN0823813
BRANCH: AKNU CAMPUS, RAJAMAHENDRAVARAM

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ద్వారా శ్రీ రాపర్తి రామా ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా కానవరం వారిచే పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సులో ప్రవేశాల దరఖాస్తులకు జూన్ 30వ తేదీ వరకు గడువు పొడిగించామని వీసీ ఆచార్య కె పద్మరాజు తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీ డిప్లొమా ఇన్ యోగా వన్ ఇయర్ పార్ట్ టైమ్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన అడ్మిషన్స్ గడువును 30వ తేదీ వరకు పొడిగించామన్నారు. ఆలస్య రుసుముతో జూలై 8వ తేదీ వరకు ప్రవేశ దరఖాస్తులు స్వీకరిస్తారని తెలియజేశారు. నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాంగణంతో పాటు శ్రీ రాపర్తి రామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా, కానవరంలో 50 సీట్లు చొప్పున కోర్సును అందిస్తున్నామన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన స్త్రీ, పురుషులు పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు పొడిగించిన తేదీలలోపు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్సైట్ ను సంప్రదించాలని తెలియజేసారు.

## మంచిమాట

విశ్వాసం, ఋజువర్తనం, శ్రద్ధాభక్తులు ఉన్నంతవరకు విజయం కలగడం ఖాయం.

So long as you have faith and honesty and devotion, everything will prosper.

- స్వామి వివేకానంద



# రాష్ట్రస్థాయి యోగాసన జడ్జెస్ ట్రైనింగ్ ప్రోగ్రాం విజయవంతం




యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కానవరం రాపర్తి రామ యోగా కాన్సిట్యూషనల్ ట్రస్ట్ వేదికగా 7, 8, 9 తారీకుల్లో రాష్ట్రస్థాయి యోగాసన జడ్జెస్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ముగింపు కార్యక్రమానికి ఆది కవి నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె పద్మరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంలో పాల్గొని ఉత్తీర్ణులైన యోగ జడ్జెస్ అందరికి వైస్ ఛాన్సలర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్ గా తూర్పుగోదావరి జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఇంటర్నేషనల్ యోగ జడ్జ్ కె ఎన్ వి శ్రీధర్ రెడ్డి వ్యవహరించారు. కే ఎన్ వి శ్రీధర్ రెడ్డి ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్ యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వైయస్ ఏ ఏ పి రాష్ట్ర అధ్యక్షులు ఏ రాధిక, వైస్ ప్రెసిడెంట్ జొన్నలగడ్డ శ్రీనివాస్ ట్రెజరర్ కే రామకృష్ణ రాపర్తి రామ యోగ కాన్సిట్యూషనల్ సెక్రెటరీ ఎం వి జి ఎస్ శర్మ ప్రిన్సిపాల్ ఎన్ శివశంకర్ రిసోర్స్ పర్సన్స్ గా ఏం శైలజ, డాక్టర్ పి సుమన, కే హేమ నిర్మలారెడ్డి, ఏ సుజాత, అర్చన రాఘవేంద్ర మొదలగు వారి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుండి 70 మంది జడ్జెస్ గా ట్రైనింగ్ పొంది పరీక్షలో ఉత్తీర్ణులై వైస్ ఛాన్సర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకోవటం జరిగిందని కే ఎన్. వి. శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.




# ఫాదర్స్ డే

## (జూన్ 3 వ ఆదివారం)

**ప్రియమైన నాన్న....**




హ్యాపీ ఫాదర్స్ డే. నీ ఎదురుగా నిలబడి చేయి కలిపి విష్ చేయాలంటే నాకు,నీకు కూడా ఇబ్బందే.మనం ఎంత ప్రేమగా ఉన్నా ఇలా ఫాదర్స్ డే అంటూ ఒక రోజుకి పరిమితం చేయడం నాకు ఇష్టం లేదు నాన్న... నేనంటే నీకు ఎంత ప్రేమో నాకు నువ్వు అంటే అంతే ప్రేమ. అవసరానికి అప్పుడప్పుడు భయం నటిస్తుంటా కానీ ఒక్కోసారి నీ భుజంపై వాలి నిద్ర పోవాలని చూస్తుంటాను.నా చదువు విషయంలో అందరూ వ్యతిరేకంగా ఉన్నప్పుడు నువ్వు కూడా వాళ్ళతో పాటే ఉన్నావు అనుకున్నా కానీ అమ్మతో పోట్లాడి మరి నాకు ఇష్టం అయిన కోర్సులో చేర్పించావు.

అల్లరి చేస్తూ నీ పని చెడగొట్టినా నన్ను భుజాన మోసుకొని తిప్పావు.నీకు ఎంతో నచ్చి కొనుక్కున్న బండి చెడగొట్టినా కూడా నన్ను ఒక్క మాట కూడా అనలేదు.నేను తప్పు చేసినప్పుడు అమ్మ నన్ను కొడుతున్నప్పుడు అడ్డుకొని నా పక్షాన నిలబడ్డావు. నీకు చెప్పకుండా నా మొదటి జీతం నాకు నచ్చినట్టు ఖర్చు పెట్టుకున్నా కూడా నా ఇష్టాన్ని ఒప్పుకున్నారు. నువ్వు లేని సందర్భం నా జీవితం లో ఏముంది నాన్న! నేను ఓడిపోయినపు మౌనంగా రోదించి, నేను గెలిచినప్పుడు పదిమందికి చెప్పుకొనే నిజాయతీ అయిన స్నేహితుడివి నువ్వే కదా నాన్న.

నీ అంత మంచి నాన్ననీ నేను అవుతానో లేదో కానీ నన్నొక మంచి మనిషిలా తీర్చిదిద్దింది నువ్వే కదా! నీ కష్టమే నన్ను ఇంతటివాడిని చేసింది.నీకు ఏమిచ్చినా నీ ఋణం తీర్చుకోలేను.లవ్ యూ నాన్న!..

- బి.సుశాంత్ కుమార్

# బయోడైవర్సిటీ

జీవవైవిధ్య సమస్యలపై అవగాహన పెంచడానికి ఐక్యరాజ్యసమితి మే 22ని అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం (IDB)గా ప్రకటించింది. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం 2024 యొక్క అధికారిక థీమ్ "ప్రణాళికలో భాగం అవ్వండి" ( To Be Part of The Plan) . "జీవవైవిధ్యం" అనే పదం రెండు పదాల కలయిక – "బయో" అంటే జీవితం మరియు "వైవిధ్యం", ఇది విభిన్న మూలకాల పరిధి లేదా వైవిధ్యాన్ని సూచిస్తుంది. కాబట్టి, జీవవైవిధ్యం తప్పనిసరిగా భూమిపై సహజీవనం చేసే జీవుల యొక్క విస్తారమైన వైవిధ్యాన్ని కలిగి ఉంటుంది. జీవ వైవిధ్యం మానవ నాగరికత యొక్క ప్రాథమిక అంశంగా పరిగణించబడుతుంది. వైవిధ్యమే సృష్టి లక్షణం అంటారు స్వామి వివేకానంద.

మన సృష్టిలో గల జీవరాశులలో ఏ ఒక్కటి ఎక్కువ కాదు, ఏదీ తక్కువ కాదు. అన్ని సమానమే. అన్నీ ఒకదాని మీద ఒకటి ఆధారపడి జీవనం సాగిస్తుంటాయి. మనిషి తన ప్రతి అవసరానికి ప్రకృతి మీద ఆధారపడ్డాడు. ప్రకృతి లేనిదే మనిషి జీవితం లేదు. వ్యవసాయ పద్ధతులే కావచ్చు, జీవన విధానమే కావచ్చు, ఆహారపు అలవాట్లే కావచ్చు,అన్నీ సృష్టి చక్రానికి(Life cycle) లోబడే ఉంటాయి.చెరువులో ఉండే కీటకాలను తిని కప్ప జీవిస్తుంది. కప్పను తిని పాము జీవిస్తుంది, పామును గద్ద తింటుంది, గద్ద మరణించాక దాన్ని క్రిములు తిని భూమిలో కలిపేస్తాయి. అది మొక్కలకు ఎరువుగా మారుతుంది. ఇదంతా ఒక గొలుసుకట్టు (Chain reaction)విధానం. ఏ ఒక్క ప్రాణి అంతరించినా మిగితా అన్నిటి మీద ప్రత్యక్షంగా తీవ్ర ప్రభావం ఉంటుంది, మిగతా ప్రాణుల మీద పరోక్షంగా



ముప్పు ఉంటుంది. ఇలా జగత్తులో అనేక వృత్తాలు (Life Cycles) ఉంటాయి. వాటిలో మనిషి ఏ మాత్రం జోక్యం చేసుకున్నా అది వినాశనానికి దారి తీస్తుంది, ఏ ఒక్క జీవి అంతరించినా, మానవ మనుగడ ప్రశ్నార్ధకమవుతుంది.




ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా 10,000 జాతుల జీవరాశులు అంతరించిపోతున్నాయి.ప్రపంచంలోని 12 మహా జీవవైవిధ్య ప్రాంతాలలో భారత దేశం ఒకటి. సుమారు 45 వేల వృక్ష జాతులు, దాదాపు 77 వేల జంతు జాతులు ఈ దేశంలో ఉన్నాయి. కానీ ఇదంతా గతం. నేడు విస్తారమైన జీవ సంపదలో 10 శాతానికిపైగా ప్రమాదంలో ఉంది. వాటిలో చాలా జాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలలో 50 శాతానికిపైగా అరణ్యాలు, 70 శాతానికి పైగా నీటి వనరులు లుప్తమైపోయాయి. సముద్రతీరాలను కాలుష్యం చేసేశాం, అందువల్ల సముద్రంలో ఉన్న జీవరాసులు కూడాతగ్గి పోతున్నాయి. అరణ్యాలలోని వన్యప్రాణుల్ని వేటాడి కొందరు అంతమొందిస్తున్నారు. ఈ విధంగా మానవుల వల్ల అన్ని రకాల జీవరాశులకు నష్టం వాటిల్లుతుంది. మానవ తప్పిదాల వల్లే జీవవైవిధ్యం తగ్గిపోతుంది. వ్యవసాయంలో రసాయనిక ఎరువులకు, కీటక నాశనులకు ప్రాధాన్యత పెరిగింది. మందుల కంపెనీలు లాభాపేక్ష వాటిని అధికంగా, విచక్షణారహితంగా వాడేలా చేసింది. దీంతో మన నేలను, దానిపై నివసించే విలువైన జీవసంపదను కోల్పోవాల్సి వచ్చింది.భారతీయ సంస్కృతిలో ప్రతి చిన్న ఆచారం ప్రకృతిహితంగానే ఉంటుంది.మన పూర్వీకులు నేలను అమ్మ వంటిది అని భావించి విషపు రసాయన ఎరువులు ఉపయోగించేవారు కాదు.కేవలం ఆవు పేడ, మూత్రాన్ని మాత్రమే ఉపయోగించి తాను సొంతంగా తయారు చేసుకున్న ఎరువునే వాడేవారు . వ్యవసాయంలో ప్రకృతి సాయం తీసుకునేవారు అందుకే 3-4 రోజులు నీళ్ళు పెట్టకపోయినా, మొక్క వాడిపోదు. ఆఖరున దిగుబడి అధికంగా వస్తుంది, వచ్చినదాంట్లో కొంచెం పిచ్చుకల కోసం సింహాద్వారానికి కట్టి పక్షులని ఆహ్వానించేవాడు . విత్తనాలను కూడా సంప్రదాయ పద్ధతుల్లో నిల్వ చేసేవారు, ఆవిధంగా ఇతర జీవులకి కూడా ఆహారం ఆశ్రయం ఇచ్చేవారు. రసాయనాలు వాడని కారణంగా పొలంలో రకరకాల మిత్రజీవాలు కనిపిస్తాయి. వైవిధ్యం వెల్లివిరుస్తుంది. రైతుకు పెట్టుబడి పెట్టకుండా లాభం వస్తుంది. ఇది ప్రకృతి వ్యవసాయం. జీవవైవిధ్యాన్ని రక్షించే అచ్చమైన, స్వచ్ఛమైన భారతీయ వ్యవసాయపద్ధతి. ఈ విధానంలో పూసిన పూలు, పండించిన కూర గాయలు, పళ్ళు రెండు నుంచి మూడు రోజుల వరకు ఫ్రిజ్‌లో పెట్టకపోయిన పాడైపోవు, భూమి కొన్ని ఏళ్ళ తర్వాత ఏ విధమైన ఎరువు వేయకున్నా బంగారం పండిస్తుంది. విశేషమేమిటంటే.. మన దేశంలో ఆదివాసులు (గిరిజనులు, కొండజాతి ప్రజలు) ఎక్కడున్నారో అక్కడ జీవవైవిధ్యం ఎక్కువగాను, పదిలంగానూ ఉంది. వాళ్ళు ఇంకా మన పూర్వీకుల బాటలోనే నడుస్తున్నారు. పట్నాలలో కాలుష్యాన్ని పెంచే జీవన విధానాలు ఎక్కువైపోయాయి. అందులవలన జీవవైవిధ్యం కనిపించట్లేదు.

**యువతా! మేలుకో! భవిష్యత్తును కాపాడుకో!**

మానవులు అవసరాలకోసం, ఆనందం కోసం ప్రకృతిని నాశనం చేస్తున్నాడు. ఫలితంగా ఎన్నో రకాల జబ్బులు వస్తున్నాయి, ఎన్నో జీవరాసులు అంతరించిపోతున్నాయి. ఇంకా మన చుట్టూ ఏమి జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారు. మనం సృష్టించిన కాలుషిత వాతావరణం, మనం తీసుకునే హానికరమైన ఆహారం, ఎక్కడచూసినా జబ్బులు, హాస్పిటల్స్ ఇవన్నీ మనవల్లే జరుగుతున్నాయి . జీవవైవిధ్యం యొక్క అపారమైన ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం ఒక అమూల్యమైన అవకాశాన్ని అందిస్తుంది. ఇప్పటికైనా మనం మేలుకొని మన జీవనశైలిని మార్చుకోవాలి, మన ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి.రసాయన కాలుష్యాన్ని అరికట్టి భూతాపాన్ని తగ్గించాలి. జంతువుల్ని, మొక్కల్ని పరిరక్షించుకోవాలి. చాలా మంది జంతువుల చర్మాలతో చేసే వస్తువుల్ని వాడుతుంటారు. దీన్ని మానుకోవాలి. ఈ ప్రపంచాన్ని నాశనం చేసే హానికరమైన విషయం ప్లాస్టిక్ వాడకం, దీని వాళ్ళ గాలి,నేల, నీరు కాలుష్యానికి గురిఅవుతున్నాయి. చాలారకాల జీవరాసులు మనుగడ సాగించలేక చనిపోతున్నాయి. అందువల్ల జీవవైవిధ్యం పూర్తిగా దెబ్బతింటుంది.మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం.ప్రకృతిని కాపాడుకునే భాధ్యత మన అందరిది. ఎక్కడలేని అపారమైన సహజ సంపద మన భారతదేశం లో ఉంది,ఇది మానవాళికి గొప్ప వరం. సహజమైన, స్వచ్ఛమైన భారతదేశాన్ని తయారు చేయటానికి, మీరుకూడా ఒక అడుగు ముందుకు వేయండి.

- డా.ఎ.ఎస్.గౌరీపార్వతి
వృక్షశాస్త్ర విభాగం,
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.

# మహిళా సాధికారత కోసం యోగా!



యోగ భారతదేశంలో ఉద్భవించిన పురాతన అభ్యాసం. శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక అంశాలను కలిగి ఉంటుంది. “యోగ” అనే పదం సంస్కృతం నుండి వచ్చింది. ఇది శరీరం మరియు మనసు యొక్క ఐక్యతను సూచిస్తుంది. నేటి ప్రపంచంలో, యోగా వివిధ రూపాల్లో అభ్యసించబడుతోంది మరియు విస్తృత ప్రజాదరణ పొందింది. ఇది మన వేగవంతమైన జీవితాలలో సమతుల్యతను కనుగొనడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. మన శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక అంశాలలో సామరస్యాన్ని ప్రోత్సహిస్తుంది. యోగ మనకు సంపూర్ణ ఆరోగ్యం పెంపొందించడానికి, ఒత్తిడిని తగ్గించడానికి మరియు శక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

యోగా సాధన వల్ల కలిగే అనేక ప్రయోజనాలను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా ప్రజలు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సంవత్సరం 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని “మహిళా సాధికారత కోసం యోగా” అనే థీమ్తో జరుపుకుంటారు. యోగా మహోత్సవ్ 2024 లక్ష్యం, మహిళల శ్రేయస్సును ప్రోత్సహించడం, ప్రపంచ ఆరోగ్యం మరియు శాంతిని పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించి యోగాను విస్తృత ఉద్యమంలోకి నడిపించడం. వారి వయస్సు లేదా పరిస్థితులతో సంబంధం లేకుండా మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడానికి, ఒత్తిడి నిర్వహణ వంటి మహిళలను ప్రభావితం చేసే వివిధ ఆరోగ్య పరిస్థితులపై పరిశోధనలకు మంత్రిత్వ శాఖ చురుకుగా మద్దతునిచ్చింది. సాక్ష్యం ఆధారిత పరిశోధన ద్వారా మహిళా సాధికారతను ప్రోత్సహించడం ఈ థీమ్ లక్ష్యం. సాధికారత పొందిన మహిళ నాయకులు, విద్యావేత్తలు, మరియు న్యాయవాదులు మార్పు కోసం చేరికను పెంపొందించడం, వైవిధ్యం మరియు సమాజం అంతా సాధికారత పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తారు.

స్త్రీ సాధికారత అనేది స్త్రీలందరూ తమ స్వంత ఎంపికలు చేసుకోగలిగి, ఆత్మవిశ్వాసంతో వ్యవహరించగలిగే సమాజాన్ని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. నిరంతర యోగాభ్యాసం ద్వారా, మహిళలు తమ శరీరాలను బలోపేతం చేయడమే కాకుండా, మానసిక స్థితిస్థాపకత మరియు దృఢ సంకల్పాన్ని పెంపొందించుకోవచ్చు. తద్వారా వారి జీవితంలోని వివిధ దశలలో శక్తివంతం చేయబడతారు. బుద్ధిపూర్వక శ్వాస, ధ్యానం మరియు సున్నితమైన కదలికలపై యోగా దృష్టి పెట్టడం వల్ల నాడీ వ్యవస్థను ఉత్తేజ పరచడంలో సహాయపడుతుంది. యోగా వలన అన్ని గ్రంథాలు బాగా ఉత్తేజపడి వాటి విధులను సక్రమంగా పని చేస్తాయి. ప్రస్తుతం 90% జబ్బులు ముందు మనసుకు వచ్చి తర్వాత శరీరంకు వస్తున్నాయి కనుక మానసికంగా దృఢంగా ఉండడం కోసం ప్రతి రోజు యోగ సాధన చేయాలి

యోగా ఒక మతం కాదు, ఇది ఒక శాస్త్రం, జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది, చర్యలో నైపుణ్యం తీసుకువస్తుంది, భావోద్వేగాలను నియంత్రిస్తుంది, అన్ని వ్యాధులను నయం చేస్తుంది, క్రమశిక్షణను పెంచుతుంది, వ్యక్తిత్వాన్ని మారుస్తుంది, సంకల్ప శక్తిని అభివృద్ధి చేస్తుంది, సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తుంది, మనస్సు యొక్క స్పష్టతను ఇస్తుంది, సామరస్య జీవనం కోసం ఏకాగ్రతను పెంపొందిస్తుంది, ప్రవర్తనా సరళిని మారుస్తుంది, ఆలోచనల స్వచ్ఛతను ఇస్తుంది, సానుకూల ఆలోచనను అభివృద్ధి చేస్తూ మహిళా సాధికారత సాధించడంలో యోగ తోడ్పడుతుంది. అందుకే మనం యోగాను దినచర్యలో భాగంగా చేసుకుందాం.

**- డా.లగుడు ముత్యాలనాయుడు**
సహాయాచార్య, బోటనీవిభాగం , ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

# రక్తదానం చేద్దాం ప్రాణాలను కాపాడదాం

## (జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవం)

**రక్తం చెట్లకు కాసేది కాదు, బావిలో ఊరేది కాదు, కర్మాగారాలలో తయారు చేసేది కాదు, మెడికల్ షాపులో దొరికేది కాదు. మనిషిలో మాత్రమే ఉండేది రక్తం, మంచి మనసున్న మనిషి మాత్రమే ఇవ్వగలిగేది రక్తం. ఇదే వాస్తవం...**




ప్రపంచం అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో ముందుకు దూసుకుపోతున్నప్పటికీ కృత్రిమంగా రక్తాన్ని తయారు చేయడం నేటికీ సాధ్యం కాలేదు. భారతదేశమంతటా ప్రతి 2 సెకండ్లకు ఒకరికి రక్తం అవసరం అవుతుంది. రక్త కొరతతో ప్రతిరోజు అనేకమంది తలసేమియా చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, ప్రమాద బాధితులు నేటికి కూడా మరణిస్తూనే ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సంఖ్యలో యువత కలిగిన దేశంగా గర్వంగా చెప్పుకుంటున్న మన భారతదేశంలో ఇలా రక్త కొరత కారణంగా మరణాలు సంభవించడం అనేది బాధాకరమైన విషయం. రక్తదానం పైన పూర్తి అవగాహన లేకపోవడం వలన మరియు రక్తదానం చేస్తే బలహీన పడిపోతాము అనే అపోహలు వల్లనే ఇటువంటి కన్నీటి పర్యంతమైన సమస్యలు ఎదుర్కొనవలసి వస్తుంది.

సురక్షితమైన రక్తం మరియు రక్త ఉత్పత్తుల ఆవశ్యకతపై అవగాహన కల్పించడానికి మరియు రక్త దాతలకు, రక్తదానంపై కృషి చేసిన స్వచ్ఛంద సేవా సంస్థలకు బహుమతి ప్రధానంతో గౌరవించుకోవాలనే సదుద్దేశంతో ప్రతి ఏటా జూన్ 14వ తేదీ ప్రపంచ రక్త దాతల దినోత్సవం నిర్వహించబడుతున్నది. ఈ కార్యక్రమం 2004లో మొదటిసారిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్ మరియు రెడ్ క్రెసెంట్ సొసైటీస్, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లడ్ డోనర్ ఆర్గనైజేషన్స్ మరియు ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ సంస్థలచే ప్రారంభించబడింది. మొట్టమొదటిసారిగా రక్త వర్గాలను కనుగొన్న ప్రముఖ జీవశాస్త్రవేత్త, వైద్యుడు, నోబెల్ బహుమతి గ్రహీత కార్ల్ ల్యాండ్‌స్టీనర్ గౌరవార్థం అతని జన్మదినోత్సవం సందర్భంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహింపబడుతున్నది.

రక్తదానం అనేది మానవత్వంతో కూడిన గొప్ప చర్య. రక్తదానం వలన ఒక ప్రాణాన్ని కాపాడగలిగాం అనే గొప్ప ఆత్మ సంతృప్తి, మానసిక ఆనందంతో పాటు దాతకు మరికొన్ని ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయి. కొన్ని సందర్భాలలో మనం చేసే ఒక్క యూనిట్ రక్తదానం కాంపోనెంట్స్ (ఎర్ర రక్తకణాలు, ప్లేట్లెట్స్, ప్లాస్మా...) విభజించడం ద్వారా మూడు ప్రాణాలను రక్షించవచ్చు. ప్రతి మూడు నెలలకు చేసే సురక్షితమైన నిరంతర రక్తదానం వల్ల శరీరంలోని అధికమైన ఐరన్ నిల్వలు క్రమబద్ధీకరించబడి గుండెపోటు, క్యాన్సర్ వంటి ప్రమాదాలు వచ్చే ముప్పు తగ్గుతుంది. అదేవిధంగా రక్తదానంతో బిపి, హిమోగ్లోబిన్, హెచ్ఐవి, హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, సిఫ్లిస్, ఎంపీ వంటి పరీక్షలు చేయడం వలన ఉచితంగా మినీ హెల్త్ చెకప్ చేసినట్లు అవుతుంది. రక్తదానం వలన నూతన ఉత్తేజంతో ఎర్ర రక్తకణాలు, తెల్లరక్త కణాలు పునరుత్పత్తి జరిగి రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ముఖ్యంగా ఒక నిండు ప్రాణాన్ని కాపాడి ఆ ప్రాణంపై ఆధారపడిన ఎన్నో జీవితాలను నిలబెట్టిన వారు అవుతారు.

సాధారణంగా మానవ శరీరంలో ప్రతి 120 రోజులకు ఎర్ర రక్త కణాలు, 13 రోజులకు తెల్ల రక్త కణాలు, 7 రోజులకు ప్లేట్లెట్స్ ఇలా సుమారు ఒక 70 సంవత్సరాలు వచ్చేంతవరకు నిరంతరం పునరుత్పత్తి జరుగుతూనే ఉంటాయి. మనం రక్తదానం చేసినా చెయ్యకపోయినా సరే సాధారణంగా నశించే ఈ కణాలు మన రక్తదానంతో ఇంకొక కుటుంబంలో వెలుగులు నింపుతాయి. సగటున 50 కేజీల బరువు, 12.5 గ్రాముల హీమోగ్లోబిన్ కలిగి ఆరోగ్యంగా ఉన్న18 నుంచి 60 సంవత్సరాల లోపు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయ్యొచ్చు. నిపుణులైన వైద్య సిబ్బంది పర్యవేక్షణలో రక్తదాతలను పరీక్షించిన తర్వాతే రక్తం తీస్తారు, అందుచే ఎటువంటి అపోహలు లేకుండా నిస్సంకోచంగా రక్తదానం చేయవచ్చు. నేషనల్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ కౌన్సిల్ గైడ్లైన్స్ ప్రకారం ఆరోగ్యంగా ఉండే ప్రతి ఒక్కరూ పురుషులు అయితే ప్రతి 3 నెలలకు ఒకసారి, మహిళలు ప్రతి 4 నెలలకు ఒకసారి నిస్సంకోచంగా రక్తదానం చేయవచ్చు. రక్తదానం తర్వాత ఎటువంటి బలహీనత సంభవించదు. 15 నిమిషాలు విశ్రాంతి తీసుకుని, ఒక రోజు ద్రవ పదార్థాలు విరివిగా తీసుకుంటే ఎప్పటిలా ఆరోగ్యంగా ఇంకా ఉత్సాహంగా ఉంటారు. కనుక ప్రతి ఒక్కరూ చైతన్యంతో స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొనాలి. ఒక తల్లి కన్నీళ్లు తన బిడ్డను రక్షించలేవు కానీ మన రక్తం ఆ పని చేయగలదు, రక్తదానం చేయండి ప్రాణాలను కాపాడండి.

**పాగోటి రాంబాబు**
(బ్లడ్ బ్యాంక్ కౌన్సిలర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ - విశాఖపట్నం డిస్ట్రిక్ట్ బ్రాంచ్)
ఎమ్ ఎ సోషల్ వర్క్ పూర్వ విద్యార్థి
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in